సాక్షి ప్రకాశం

సోమవారం । 17 । మార్చి । 2025



మా వాళ్లే మట్టి దొంగలు..!

టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు చెరువు మట్టిని తవ్వేస్తున్నారు. వేలాది టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారని టీడీపీ వర్గానికి చెందిన యువకులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో..




మోసం చేయడం చంద్రబాబు నైజం

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. - 8లో..


గరిష్టం/కనిష్టం
38/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఒక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.



విజయోస్తు



పరీక్ష కేంద్రాలు	183
హాజరు కానున్న విద్యార్థులు	29,602 మంది
సమస్యాత్మక కేంద్రాలు	6
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు	9
సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు	20
ఇన్విజిలేటర్లు	1900 మంది
చీఫ్ సూపరింటెండెంట్లు	183 మంది
డిపార్ట్‌మెంట్ అధికారులు	183 మంది
హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌కు వాట్సాప్ నంబరు	9552300009
కంట్రోల్ రూమ్ నంబరు	7842777439

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా..
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- 38 స్టోరేజ్ పాయింట్లలో రెండు సెట్ల ప్రశ్నపత్రాలు భద్రం
- జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహణ
- అర్ధగంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతి

ఒంగోలు సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఈనెల 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా విద్యాశాఖాధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే హాల్‌టికెట్లను ఆయా ప్రధానోపాధ్యాయుల లాగిన్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో పాటు ప్రభుత్వ వాట్సాప్ నంబరు మన మిత్ర 9552300009 కు విద్యార్థి వివరాలు పంపి హాల్‌టికెట్ ను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. పదో తరగతి పరీక్షలన్నీ జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించనున్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు:

జిల్లా వ్యాప్తంగా 29,602 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇందులో బాలురు 14,994 మంది, బాలికలు 14,608 మంది ఉన్నారు. ఇందులో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 28,176 మంది ఉండగా, తెలుగు మీడియం విద్యార్థులు 1423 మంది, ఉర్దూ మీడియం విద్యార్థులు ముగ్గురు చొప్పున మొత్తం 29,602 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తం 183 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6 కేంద్రాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు ఒక గంట ముందుగా అంటే 8.30 గంటలకు చేరుకోవాలని, పరీక్షకు అర్ధగంట ముందుగా 9 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 38 స్టోరేజ్ పాయింట్లలో రెండు సెట్ల ప్రశ్న పత్రాలను భద్రపరిచారు. పోలీసు బందోబస్తు మధ్య ఏ రోజుకారోజు ప్రశ్న పత్రాలను సమీపంలోని పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లనున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..



కంభంలోని పరీక్ష కేంద్రం

పదో తరగతి పరీక్షలు జరిగే సమయంలో ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష జరిగే కేంద్రాల సమీప ప్రాంతాల్లో జెరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసేయాలి. అలాగే కేంద్రంలోకి స్మార్ట్‌వాచ్‌లు, కాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లను నిషేధించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1900 మంది ఇన్విజిలేటర్లను, 183 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 183 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా 9 ఫ్లయింగ్ స్క్వాడ్, 20 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా

ఈనెల 17వ తేదీ తెలుగు, 19న హిందీ, 21న ఇంగ్లిషు, 24న గణితం, 26న ఫిజిక్స్, 28న బయాలజీ, 31న సోషల్ పరీక్షలు జరగనున్నాయి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖాధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వసతుల విషయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే కంట్రోల్ రూమ్ నంబరు 7842777439 కు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తారు.

ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఎస్ఎస్‌సీ) షెడ్యూల్ ఇలా..

ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఎస్ఎస్‌సీ) పరీక్షలు ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు. ఈ పరీక్షల కోసం 23 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1564 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు సమయం ఉంటుంది. 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు



పదో తరగతి విద్యార్థులు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా రాయాలి. ఎక్కడైనా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

– అత్తోట కిరణ్‌కుమార్, డీఈఓ, ఒంగోలు

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు టౌన్: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన అన్నీ రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచీలు, మొబైల్ ఫోన్లు, ఐపాడ్‌లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు, సిబ్బంది తప్ప ఇతరులు ఎవరూ ఉండరాదన్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా, వారిని ప్రోత్సహించినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంల వద్ద పోలీసు సిబ్బందితో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాలు తీసుకొని వెళ్లే సమయంలో, జవాబు పత్రాలను తీసుకొని వచ్చే సమయంలో పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను మూసి వేయిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే సహాయం చేయడానికి పోలీసు శాఖ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొబైల్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల ఎదురైతే పోలీసు సహాయం కోసం వెంటనే 100, 112, 9121102266కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

న్యూస్‌రీల్

నీకన్నా పెద్ద యాక్టర్ లేరు బాలినేనీ..

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: బాలినేని శ్రీనివాసరెడ్డి కన్నా పెద్ద యాక్టర్ ఎవరూ లేరు. ఆయన పెద్ద కమల్ హాసన్..ముందు ఆయనతోనే సినిమా చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. జనసేన ఆవిర్భావ సభలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలపై బూచేపల్లి మండిపడ్డారు. ఆమేరకు ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ''అయ్యా .. బాలినేని నిన్ను టీడీపీలో చేర్చుకోకుండా తిరస్కరించే సరికి నీ అవసరం కోసం, రాజకీయ లబ్ధి కోసం జనసేనపార్టీలో చేరావు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి లేకపోతే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రాజకీయం లేదని, సీఎం కాలేడని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో చనిపోయారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టింది 2011లో... ఇన్ని సంవత్సరాలు జనాలతో కలిసి కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ స్థాపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెక్కల కష్టంతో ప్రజలు, కార్యకర్తల మద్దతుతో వైఎస్సార్ ఆశీస్సులు, ఆశయాలతో 2019 లో సీఎం అయ్యారు. మళ్లీ జగన్ సీఎం కాలేడని చెబుతున్నావు.. మీతాతలు, ముత్తాతలు దిగి వచ్చినా 2029లో జగన్ సీఎం కావడం తథ్యం. వైఎస్ జగన్ మీకు డబ్బులు ఇవ్వాలి, మీ కుటుంబ డబ్బులు కొట్టేశారని చెబుతున్నారు.. బాలినేనీ..ప్రకాశంలో జిల్లాలో కార్యకర్తలు, నాయకులు, పాత ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌ల నుంచి నువ్వు దోచినట్లు ఎవ్వరూ దోచుకోలేదు. బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ నుంచి బయటకు పోయినప్పటి నుంచి జిల్లాలో పార్టీ చాలా సంతోషంగా, ప్రశాంతంగా ఉంది. మాకు పీడ విరిగిపోయిందని అనుకుంటున్నారు. అవసరమైతే జెడ్పీ చైర్‌పర్సన్‌ను దించేస్తామని అంటున్నావు..నీలాగా జెడ్పీటీసీలు అవకాశవాదం కోసం రాజకీయాలు చేసేవారు కాదు. పార్టీ మారేవారు ఎవరూ లేరు. ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌ను ఎవరూ ఏమీ చేయలేరు. బాలినేని శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి అతని రాజకీయాల కోసం ఎమ్మెల్సీ అవుతాను, మినిస్టర్ అవుతానని కల్లబొల్లిమాటలు చెబుతున్నారు. అయ్యా పవన్‌కళ్యాణ్ ఒకటే గుర్తుపెట్టుకోండి బాలినేనికన్నా అవకాశవాది ఎవరూ లేరు, అతను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ నాశనం అవుతుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతుతో జిల్లాలో ప్రతి కార్యకర్తకు అండగా ఉండి పార్టీని పటిష్టం చేయడం కోసం కృషి చేస్తాను'' అని బూచేపల్లి అన్నారు.

దమ్ముంటే జెడ్పీ పీఠాన్ని టచ్ చేయి..

- వైఎస్ జగన్‌ను, బూచేపల్లి కుటుంబాన్ని విమర్శించే అర్హత నీకు లేదు
- మా కుటుంబం గెలవకూడదని ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేశావు
- మేమంటే ఎందుకంత కక్ష, ఏం ద్రోహం చేశాం
- మాజీ మంత్రి బాలినేనిపై భగ్గుమన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: ''నా జెడ్పీ పీఠాన్ని బాలినేని లాగేస్తాడట.. దమ్ముంటే నా కుర్చీ లాగేయి. నీవు లాగేస్తాననగానే వచ్చేవారు ఎవరూ లేరు. జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని నాకు జగన్ ఇచ్చారు. కుర్చీని టచ్ చేసే అర్హత వాసుకు లేదు'' అని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై ధ్వజమెత్తారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆమె జెడ్పీటీసీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ''వైవీ సుబ్బారెడ్డి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన రాజకీయ భిక్షతోనే మంత్రి పదవులు, ఎమ్మెల్యే పదవులు అనుభవించావు. అసలు నువ్వు ఏరకం నాయకుడివి..పార్టీ వదిలి వెళ్లనని ప్రతి సమావేశంలో చెప్పి..పార్టీ వదిలి వెళ్లిపోతూ వైఎస్ జగన్‌ను విమర్శించడం అన్యాయంగా ఉంది. అంతకు ముందు రాజకీయాల్లో నీ స్థాయి ఏంటో అందరికీ తెలుసు. ఎన్నికల్లో బూచేపల్లి కుటుంబం గెలవకూడదని ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేశావు. బాలినేనీ..నీవు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల్లో బూచేపల్లి కుటుంబం సంపాదించుకున్న మంచి పేరుతోనే అన్నింటినీ ఛేదించుకుని ప్రజాక్షేత్రంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విజయం సాధించారు. మా కుటుంబంపై నీకు ఎందుకు అంత కక్ష..మేము నీకు ఏం ద్రోహం చేశామని మాపై విషం చిమ్ముతున్నావు. బూచేపల్లి కుటుంబం అంటే నీలాగా ఇన్‌చార్జ్ పదవులు, సీట్లు ఇప్పిస్తానని ఎవరి దగ్గర డబ్బులు వసూలు చేసే కుటుంబం కాదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని లంచాలు తీసుకునే కుటుంబం కాదు. నా భర్త సుబ్బారెడ్డి హయాం నుంచి నేటి వరకు ఎవరికైనా ఒక రూపాయి ఇచ్చామే కానీ..లాక్కునే కుటుంబం కాదు. ఎన్నికల ముందు నువ్వు సంపాదించిన డబ్బులు జగన్ లాగేసుకున్నాడని ఆరోపిస్తున్నావు..ముందు నీవు డబ్బులు ఎక్కడ నుంచి సంపాదించావో చెప్పు. అధికారంలో ఉన్నప్పుడు పేచీల మీద పేచీలు పెట్టి జగన్‌ను ఇబ్బందులు పెట్టింది నీవు కాదా.. జగన్ డబ్బులు నువ్వు లాక్కున్నావు తప్ప జగన్ లాక్కోలేదు. ఆ అవసరం మా నాయకుడికి లేదు. 2029లో కచ్చితంగా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారు. మాకు పదవులు ఉన్నా, లేకపోయినా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తాం. బూచేపల్లి కుటుంబం పైన జగన్‌మోహన్‌రెడ్డి అభిమానంతో జెడ్పీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. జెడ్పీటీసీలందరూ మావైపే ఉన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా మమ్మల్ని అన్ని రకాలుగా బాలినేని ఇబ్బందులు పెట్టారు. నీ సీటు ఇంకొకరికి ఇస్తామని చెబుతాడు, అందరి దగ్గర డబ్బులు తీసుకుంటాడు. బూచేపల్లి కుటుంబాన్ని కానీ, జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబాన్ని కానీ విమర్శించే హక్కు బాలినేనికి లేదు'' అని వెంకాయమ్మ ధ్వజమెత్తారు.

జెడ్పీటీసీలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, మాసం జాన్‌పాల్, తాతపూడి మోజెస్ రత్నరాజు, మడతల కస్తూరిరెడ్డి, నూసం వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ జెడ్పీటీసీలు అందరూ బూచేపల్లి వెంకాయమ్మకు అండగా ఉంటారన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ మారగానే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఏకవచనంతో మాట్లాడటం బాధాకరమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ను మీరు తీసేస్తామని చెప్తే మేము గాజులు తొడుక్కుని లేముగా అని అన్నారు. ఆమె పదవీ కాలం ఐదు సంవత్సరాల్లో ఆఖరి గంట కూడా వదిలిపెట్టమన్నారు. బూచేపల్లి కుటుంబానికి ఉన్న పేరు ప్రఖ్యాతలు, అవినీతి రహిత చరిత్ర ఎవరికైనా ఉందా అని ప్రశ్నించారు. జెడ్పీటీసీలు అంతా మీరు సీట్లు ఇచ్చిన వ్యక్తులు కాదన్న విషయాన్ని బాలినేని గుర్తుంచుకోవాలన్నారు. ఒక దళిత ఎమ్మెల్యే అయిన ఆదిమూలపు సురేష్‌కు మంత్రి పదవి ఇస్తే అలిగి పార్టీకి దూరంగా ఉన్న వ్యక్తి బాలినేని అని విమర్శించారు. బాలినేని దళిత వ్యతిరేకి అన్నారు. అన్నం పెట్టిన పార్టీనీ, అన్నం పెట్టిన రాజశేఖర్‌రెడ్డి కుటుంబాన్ని నిందిస్తున్న నువ్వు కుక్క కంటే హీనమని మండిపడ్డారు. పార్టీ నుంచి బయటకు వచ్చి నిలకడ లేని పవన్‌కళ్యాణ్ తో చేరి మా అధినేతను విమర్శిస్తున్నావన్నారు. ఏమి తెలుసని పవన్‌కళ్యాణ్‌తో నీ ప్రయాణం కొనసాగిస్తావని ప్రశ్నించారు. ఏ ఒక్క మాటైన నిక్కచ్చిగా మాట్లాడిన, నిలబడిన సందర్భాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ ఎన్ని పార్టీలు మారారు.. ఎంత మందిని మార్చారన్నారు. మోడీ ని తిట్టాడు మోడీతో జతకట్టాడనీ, చంద్రబాబును తిట్టాడు చంద్రబాబుతో జతకట్టాడనీ ఇలా తన రాజకీయ వ్యభిచారం చేస్తున్న పవన్ చెంతకు చేరిన నువ్వు అంత కంటే హీనంగా రాబోయే రోజుల్లో రాజకీయాలకు దూరమవుతావని హెచ్చరించారు. పార్టీని కానీ, జగన్‌మోహన్‌రెడ్డిని కానీ మరోసారి తిట్టినా నిన్ను ముట్టడిస్తామని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. జెడ్పీటీసీలలో ఏ ఒక్కరికి కూడా చైర్మన్ ను దించాలని గానీ, పార్టీ మారే ఆలోచనగానీ లేనే లేదన్నారు. జనసేన పార్టీ బలమెంత.. దానికున్న అభిమానులు ఎంత అని ఎద్దేవా చేశారు. తామంతా వైఎస్సార్ సీపీకి విధేయులమని, డబ్బులకు లొంగేవారం కాదన్నారు. సమావేశంలో కొండపి జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణ, ఒంగోలు జెడ్పీటీసీ సభ్యురాలు చుండూరు కోమలేశ్వరి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర రావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీ భూమిరెడ్డి రమణమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, మహిళా నాయకులు సాధం విజయలక్ష్మి, అప్సర్ బేగమ్, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి..ఆకస్మిక తనిఖీ

- జీజీహెచ్‌లో శనివారం అర్ధరాత్రి వరకు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- క్యాజువాలిటీ విధుల్లో వైద్యులు కనిపించకపోవడంతో ఆగ్రహం
- ఎన్ఎన్ఐసీలోనూ వైద్యులకు బదులుగా నర్సులు విధులు నిర్వహిస్తుండడంతో మండిపడిన కలెక్టర్
- రేడియాలజీ విభాగంలోకి వెళ్లి రిపోర్టులు ఎప్పుడిస్తున్నారంటూ ప్రశ్నలు
- వైద్యుల పనితీరుపై ఆరా
- ఐదుగురు సిబ్బందికి మెమో ఇచ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



జీజీహెచ్‌లోని సీటీ స్కానింగ్ రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్:

జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి క్యాజువాలిటీ వద్దకు శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఒక కారు వచ్చి ఆగింది. అందులోంచి ఒక మహిళ దిగి క్యాజువాలిటీలోకి వెళ్లారు. ముఖానికి మాస్క్ కట్టుకొని ఉండడంతో వైద్య సిబ్బంది ఆమెను గుర్తించలేకపోయారు. చికిత్స కోసం వచ్చి ఉంటారులే అని నిర్లక్ష్యంగా ఎవరి మాటల్లో వారు పడిపోయారు. హెడ్ నర్సు మాంచి నిద్రలో గుర్రు పెడుతున్నారు. కొంత మంది మెడికోలు మాత్రం పనిచేస్తూ కనిపించారు. వారు సదరు మహిళను ఏం కావాలని అడిగారు. ఇక్కడ పనిచేసే వైద్యులు ఎక్కడకు పోయారని ప్రశ్నించడంతో సిబ్బందిలో అనుమానం వచ్చింది. తీరా చూస్తే ఆమె ఎవరో కాదు. సాక్షాత్తు కలెక్టర్ తమీమ్ అన్సారియా. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'ఓపిక నశిస్తూ... పీజీలే దిక్కనిపిస్తూ' శీర్షికతో ప్రచురించిన కథనాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం రాత్రి జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కలెక్టర్ తనిఖీకి వచ్చారని తెలుసుకుని క్యాజువాలిటీ సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. డ్యూటీ వైద్యులకు వెంటనే సమాచారం ఇచ్చారు. కానీ అప్పటికే కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. డ్యూటీలో ఉండాల్సిన వైద్యులకు బదులుగా హౌస్ సర్జన్లు విధులు నిర్వహించడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు అవసరమైన అత్యవసర సేవలను అందించాల్సిన వైద్యులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. అక్కడ చికిత్సకు వచ్చిన రోగులతో మాట్లాడి చికిత్స ఎలా చేస్తున్నారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా.. సకాలంలో స్పందిస్తున్నారా.. అని వాకబు చేశారు. వైద్యుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నుంచి గైనకాలజీ విభాగానికి వెళ్లారు. అక్కడ ఒక వైద్యురాలు మాత్రం ఉన్నట్లు సమాచారం. అక్కడ నుంచి ఎస్ఎన్‌సీయూలోకి వెళ్లి చూడగా అక్కడ కూడా కనీసం ఒక్కటంటే ఒక్క వైద్యుడు కూడా లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలకు ఏదైనా అత్యవసర సమస్య వస్తే ఎలా అని ప్రశ్నించారు. ఆ తరువాత రేడియాలజీ విభాగానికి వెళ్లారు. నిజానికి రేడియాలజిస్టు అందుబాటులో ఉండడం లేదని విమర్శలు వస్తున్నాయి. అయితే కలెక్టర్ తనిఖీ చేసే సమయానికి మాత్రం రేడియాలజిస్టు విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్స్‌రే, సీటీ స్కానింగులు, ఎమ్మారై స్కానింగుల కోసం వచ్చిన వారికి ఎప్పుడు స్కానింగ్ చేస్తున్నారు, రిపోర్టులు ఎప్పుడు ఇస్తున్నారంటూ రేడియాలజిస్టును ప్రశ్నించారు. రికార్డులను పరిశీలించారు. వైద్య చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి ఎక్కువగా పేదలు వస్తుంటారని , స్కానింగ్ చేయడంలో రోగులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. రాత్రి 11 గంటల సమయంలో ఆస్పత్రికి వచ్చిన ఆమె 12 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులు సరిగా ఉండడం లేదని, అత్యవసర చికిత్సల విషయంలో కూడా ఆలస్యంగా స్పందిస్తున్నారని పలువురు రోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నర్సింగ్ సిబ్బంది రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఒకరు చెప్పారు. పారిశుధ్యం బాగాలేదని, జనరల్ వార్డుల్లో దుర్వాసన వేస్తుండడంతో రోగులు ఉండలేకపోతున్నారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అధికారులతో మాట్లాడిన కలెక్టర్ ఆస్పత్రి పనితీరు మీద అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ ల మీద తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటన తరువాత ఐదుగురు నర్సింగ్ స్టాఫ్‌కు మెమో జారీ చేశారు. అయితే విధులు నిర్వహించకుండా పీజీలు, హౌస్ సర్జన్లతో మొబైల్ ఫోన్ల ద్వారా చికిత్స అందిస్తున్న వైద్యులను వదిలి కేవలం నర్సింగ్ స్టాఫ్ కు మాత్రమే మెమోలు ఇవ్వడమేంటని పలువురు నర్సులు ప్రశ్నిస్తున్నారు.

మెడికల్ ఐసీయూలో పనిచేయని ఏసీలు...

ఇదిలా ఉండగా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించిన తరువాత కూడా జీజీహెచ్ అధికారుల తీరు మారలేదన్న విమర్శలు వినవస్తున్నాయి. ఆస్పత్రిలోని ఐసీయూ కాంప్లెక్స్‌లోని మెడికల్ కాంప్లెక్స్‌లో మొత్తం 35 పడకలు ఉండగా 12 ఏసీలు ఉన్నాయి. కనీసం ఒక్క ఏసీ కూడా పనిచేయడం లేదు. గోడలకు బిగించిన ఫ్యాన్లు కూడా తిరగడం లేదు. అసలే ఎండాకాలం కావడంతో, ఉక్కపోతతో రోగులు విసుగెత్తి పోతున్నారు. సరిపడా గాలి ఆడక రోగులు అల్లాడుతున్నారు. పలువురు రోగులు విసనకర్రలు, పేపర్లతో విసురుకుంటున్నారు. అసలే అనారోగ్యంతో బాధ పడుతూ వచ్చిన రోగులు గాలి ఆడకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని రోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో పై అంతస్తులకు వెళ్లడానికి ఓపీ వెనక ఉన్న లిఫ్ట్ కొన్ని రోజులుగా పని చేయడం లేదు. తరచుగా మొరాయిస్తోంది. దాంతో రోగులను పై అంతస్తులకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ మరింత దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటే తప్ప జీజీహెచ్‌లో వైద్య సేవలు గాడిలో పడే పరిస్థితి లేదు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఆర్‌జేడీ



జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వర రెడ్డి ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని సెయింట్‌పాల్స్ బీఈడీ కళాశాల ఏ, బీ సెంటర్లు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పీవీఆర్ బీఈడీ కళాశాల, సూర్య స్కూల్, ఆర్.ఆర్ స్కూల్, ఎస్వీ జూనియర్ కళాశాల, ముండ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 1164 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులకు కల్పించే వసతుల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆర్‌జేడీ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు, పరీక్షా సెంటర్ల డీఓలు తదితరులు ఉన్నారు.

పూరిగుడిసె దగ్ధం



మంటల్లో కాలిపోతున్న రాములమ్మ పూరిగుడిసె

గిద్దలూరు రూరల్: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూరిగుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని ఓబులాపురంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బాధితురాలు దుగ్గెపోగు రాములమ్మ తన కుమార్తె ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో ఇంట్లో ఉన్న రాములమ్మ ఆమె కుమార్తె ప్రాణభయంలో ఇంటి నుంచి బయటకు వచ్చారు. దీంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని టీవీ, మంచాలు, వంట సామాన్లు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంతో కట్టుబట్టలతో రోడ్డుపై నిలబడే పరిస్థితి ఏర్పడిందని రాములమ్మ వాపోయింది. 6 నెలల క్రితం రాములమ్మకు చెందిన గడ్డివామును సైతం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిబూడిదైంది. ఎంపీపీ కడప లక్ష్మీ, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలికి రూ.12,500 ఆర్థికసాయం చేశారు. గ్రామ సర్పంచ్ బి.భూదేవి, ఉప సర్పంచ్ పల్లా భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రాక్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి వంట సామాన్లు, ఇతర వస్తువులు సమకూర్చారు.

కూతురు ప్రేమ వివాహం చేసుకుందని..

- పురుగుమందు తాగి తల్లి ఆత్మహత్య

జరుగుమల్లి(సింగరాయకొండ): కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందన్న ఆగ్రహంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన మూగ అలివేలమ్మ(44) కూతురితో కలిసి జనవరిలో సంక్రాంతి పండుగ నిమిత్తం అమ్మగారిల్లు కె.బిట్రగుంట వచ్చింది. ఆ సమయంలో కూతురు కోమలి ప్రేమ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన అలివేలమ్మ తల్లి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

మా వాళ్లే మట్టి దొంగలు..!

- ఇష్టం వచ్చినట్లు తవ్వకాలతో పొలాలకు నీటిపారుదల ఆగింది
- 10 రోజుల్లోనే 10 అడుగుల మేర తవ్వకాలు
- రేయింబవళ్లు తవ్వకాలతో వేలాది టిప్పర మట్టి తరలింపు
- గ్రామాన్ని నాశనం చేస్తున్నారని టీడీపీ యువకుల ఆవేదన
- ఈ తతంగం అంతా మాజీ ఎంపీపీ కనుసన్నల్లోనే
- ఫిర్యాదు చేసినా రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల గగ్గోలు



వాగ్వాదం చేసుకుంటున్న గ్రామంలో టీడీపీ ఇరువర్గాలు

దర్శి(ముండ్లమూరు):

'ఇష్టం వచ్చినట్లు మట్టిని తవ్వేస్తున్నారు. రేయింబవళ్లు సాగిస్తున్న తవ్వకాలతో ఇప్పటి వరకు కోట్లాది రూపాయల మట్టిని దోచుకెళ్లారు.' ఇదంతా అన్నది ఎవరో కాదు. సాక్షాత్తు టీడీపీ యువకులే. సొంత పార్టీ నేతల దోపిడీకి తామే బలవుతున్నామంటూ మీడియా ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం అండగా టీడీపీ నేతలు సాగిస్తున్న మట్టి దోపిడీకి పక్క పొలాల వారు నీటి పారుదల లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఏం తెలియనట్లు నటిస్తున్నారని పేర్కొన్నారు.

రేయింబవళ్లు దోచేస్తున్నారు..

ముండ్లమూరు మండలం పోలవరంలో 90 ఎకరాల చెరువు ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ చెరువుపై ఆ పార్టీ నేతల కన్ను పడింది. రేయింబవళ్లు పొక్లెయిన్లతో మట్టిని తవ్వేస్తున్నారు. అయితే ఈ మట్టి తవ్వకాలతో సొంత పార్టీలోని వారికే ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మట్టి తోలేందుకు వచ్చిన టిప్పర్లను, మట్టి ఎత్తుతున్న పొక్లెయిన్లను టీడీపీలోని మరో వర్గం యువకులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫోన్లో ఫిర్యాదు చేయగా..పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. అయితే పై నుంచి ఫోన్లు రావడంతో వాళ్లు ఏం చేయకుండా వెనుదిరిగారు. దీనిపై యువకులు ఆగ్రహంవ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు వాదులాడుకున్నాయి. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుంటే మీరేం చేస్తున్నారని, ఎందుకు అడ్డుకోవడం లేదని మట్టిని తరలించే నేతలు ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టీడీపీ యువకులు కిలారి సుమన్, కొర్రపాటి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుమారుడు మాలెంపాటి జితేంద్ర, పరుచూరి గోవర్ధన్, కొర్రపాటి అనీల్ , మాలెం పాటి భార్గవ్ , మాలెంపాటి హేమంత్ తదితరులు మాట్లాడుతూ తామంతా హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నామని, ఇష్టం వచ్చినట్లు మట్టి తవ్వకాలతో పొలాలన్నీ బీడులుగా మారుతున్నాయని, దీంతో గ్రామానికి వచ్చి తవ్వకాలను అడ్డుకున్నామని తెలిపారు.

అధికారంలోకి ఉంటే అంతే..

2014 టీడీపీ అధికారంలోకి ఉన్న సమయంలోనూ ముండ్లమూరు మాజీ ఎంపీపీ మందలపు వెంకట్రావు ఇక్కడ వాగులు, పొలాల్లో ఇసుకను అక్రమంగా తరలించి బోర్లలో నీరు లేకుండా చేశారని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పరిస్థితి లేదన్నారు. కానీ మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు చేస్తున్నారని వాపోయారు. చెరువులో మట్టిని తరలించి నీటి పారుదల లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పది అడుగుల లోతున మట్టి తీసి వేలాది టిప్పర్లు తరలిస్తుంటే ఫిర్యాదు చేసినా పోలీసులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని వాపోయారు. ఈ ఏడాది పంటలు పండటం అంతంత మాత్రమేనని, ఇప్పుడు చెరువులో మట్టి తీసి నీరులేకుండా చేస్తే పంటలు ఎలా పండించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నీరు పారే పరిస్థితులు లేక చెరువు పక్కపొలాలు మోటార్లు, ఇంజన్లు ద్వారా నీటి సరఫరా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. తామంతా హైదరాబాద్ నుంచి వచ్చి తవ్వకాలు అడ్డుకున్నామని, మేం ఉద్యోగాలకు వెళితే మళ్లీ తవ్వకాలు చేసి మా పొలాలను గుల్ల చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ విషయమై తహసీల్దార్ లక్ష్మీ నారాయణను వివరణ కోరగా..ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. చెరువులో మట్టి తీసేందుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. మట్టితీసిన పొక్లెయిన్లు, టిప్పర్ల ఫొటోలు ఇచ్చినా వాటిని సీజ్ చేస్తామని వివరణ ఇచ్చారు.



చెరువులో తవ్విన మట్టి



గ్రామస్తులు నిలిపివేసిన టిప్పర్లు

మోసం చేయడం చంద్రబాబు నైజం

- ఇచ్చిన హామీలను ఏనాడూ అమలు చేయలేదు
- మాయమాటలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం
- బంగారమ్మ తిరునాళ్లలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



ప్రభపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పుల్లలచెరువు: ఎన్నికలకు ముందు ఇష్టం వచ్చినట్లు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రాచకొండలో శనివారం రాత్రి జరిగిన బంగారమ్మ తిరునాళ్లలో ఎమ్మెల్యే చంద్రశేఖర్ పాల్గొన్నారు. ముందుగా బంగారమ్మ తల్లిని దర్శించుకొని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై నుంచి ప్రజలను ఉద్దేశించి చంద్రశేఖర్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా ఒక్క పథకం కూడా అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన సాగించారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. డీఎస్సీపై ఎన్నో ఆశలు పెట్టుకొని కోచింగ్‌లు తీసుకుంటున్న నిరుద్యోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో కూటమి నేతలు చేస్తున్న అక్రమాలు అన్ని ఇన్నీ కావన్నారు. నియోజకవర్గంలో ప్రతి వీధిలో బెల్టుషాపు దర్జాగా నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక దందాపై కూటమి నాయకులే ఇబ్బందులు పడుతూ ప్రభుత్వాన్ని ఛీ కొడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజలు మంచి పాలన చేయమని అధికారం ఇస్తే..కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేయడమే తప్ప ప్రజా సంక్షేమాన్ని కూటమి నాయకులు మర్చిపోయారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, త్రిపురాంతకం దేవస్థానం కమిటీ చైర్మన్ సుబ్బారావు, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఎ.కోటిరెడ్డి, ఏ రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, జిల్లా కార్యాచరణ కార్యదర్శి డి.వెంకటేశ్వర్లు, వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఎం వాసు, సీనియర్ నాయకులు బి.సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, గడ్డం సుబ్బయ్య, గాలిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పొట్టిశ్రీరాములు



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తదితరులు

ఒంగోలు వన్‌టౌన్: తెలుగు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలకోసం, దేశం కోసం చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు త్యాగమే నాంది పలికిందన్నారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ పోరాట పటిమకు, కార్యదీక్షకు ప్రతిబింబంగా నిలిచిన పొట్టి శ్రీరాములును యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యంతో పాటూ దళితులకు ఆలయ ప్రవేశం కోసం నిరాహార దీక్ష చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వాసు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి ప్రాణత్యాగాన్ని విస్మరించకూడదు

ఒంగోలు టౌన్: పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేయడం వల్లే తెలుగు రాష్ట్రం ఏర్పాటైందన్న విషయం విస్మరించరాదని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. మహాత్మా గాంధీ మార్గంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఎలాంటి హింసకు తావులేని ఉద్యమాన్ని చేపట్టారని, ఆమరణ నిరాహార దీక్ష ద్వారా రాష్ట్రాన్ని సాధించారన్నారు. అంటరానితనం నిర్మూలన కోసం అహర్నిశలు పాటుపడ్డారని కొనియాడారు. పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలుకా సీఐ అజయ్‌కుమార్, ఆర్ఐ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు, మోటార్‌సైకిల్ ఢీ

- ముగ్గురు చిన్నారులతో సహా నలుగురికి గాయాలు





గాయపడ్డ జడ్డా మార్క్, దేవరాజ్

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వస్తున్న కారు, మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు చిన్నారులతో సహా నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని హసానాబాద్ బస్టాప్ వద్ద ఆదివారం జరిగింది. ప్రమాదంలో మండల పరిధిలోని చాట్లమడ అగ్రహారానికి చెందిన జడ్డా మార్క్, జడ్డా అఖిల్, జడ్డా దేవరాజ్, జడ్డా దిలీప్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం క్షతగాత్రులను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. స్థానికుల కథనం మేరకు..చాట్లమడ అగ్రహారం నుంచి మండల కేంద్రానికి వస్తున్న మోటార్‌సైకిల్ మండల కేంద్రం నుంచి రామాయపాలెం వెళ్తున్న కారు ఒకదానికొకటి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మెరుగైన వైద్యం నిమిత్తం క్షతగాత్రులను నర్సారావుపేటకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం



వ్యాలీ వాహనంపై శ్రీవారు



శ్రీవారి ఉత్సవ మూర్తులకు పూజలు

- వ్యాలీ వాహనంపై ఊరేగిన వెంకటేశ్వరుడు

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తి పరవశంతో జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీ అలివేలు మంగ వెంకటేశ్వరస్వామి వార్లను వ్యాలీ వాహనంపై ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివార్లను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే సానికొమ్ము పిచ్చిరెడ్డి, సానికొమ్ము కొండారెడ్డి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదపండితులు ప్రసాదాచార్యులు, భార్గవాచార్యులు, సింహాద్రీచార్యులు స్వామికి అర్చనలు, అభిషేకాలు చేశారు. కొండపై ఉన్న అమ్మవారిని, గంగమ్మతల్లి ఆలయంలో భక్తులు పూజలు చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. సోమవారం శ్రీవారు సింహ వాహనంపై ఊరేగుతారని ఈఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఫ్రాన్సిస్ మృతదేహం

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ముత్రాసుపల్లె సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. తాటిచెర్ల గ్రామానికి చెందిన గంగిపోగు ఫ్రాన్సిస్ (34) కూలీ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై బేస్తవారిపేట సమీపంలోని పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ముత్రాసుపల్లె సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

కోర్టు పనులను పరిశీలించిన హైకోర్టు జడ్జి



కోర్టు పనులను పరిశీలించిన హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావు

సింగరాయకొండ: మండల కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పనులను ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ కె.మన్మథరావు పరిశీలించారు. 25వ తేదీ నాటికి పనులు పూర్తి కావాలని అధికారులకు సూచించారు. కోర్టుకు వచ్చేందుకు అవకాశం ఉండేలా రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కందుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఎస్ నిఖిల్‌రెడ్డి, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.